# 64

# బాలాదపి సుభాషితం

సురేష్, శేఖర్ ఇద్దరు తొమ్మిదివ తరగతి చదువుతున్నారు.

సురేష్ బాగా డబ్బున్నవాళ్ళ అబ్బాయి. మంచి తెలివైన కుర్రవాడు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటుంటాడు. దానికితోడు- ఇంట్లో ట్యూషన్ కూడా పెట్టి మరింత బాగా చదివిస్తున్నారు... అతని అమ్మా నాన్న. తల్లి పార్వతికి కొడుకంటే విపరీతమైన ప్రేమ! అందుకే ఎంతో గారాబంగా చూసుకుంటుంటుంది.

శేఖర్ పేదవాళ్ళ పిల్లవాడు. వేసుకునేవి చవక బట్టలైనా శుభ్రంగా ఉతికినవి వేసుకునేవాడు. చాలా శుభ్రం పాటిస్తూ తల చక్కగా దువ్వుకుని వచ్చేవాడు. చదువులో ఎప్పుడూ ఫస్టు వస్తుండేవాడు. శేఖర్ మంచి కుశాగ్ర బుద్ధి.., మంచి చురుకైనవాడు. పాఠాల్ని సులువుగా అర్థంచేసుకుని చక్కగా వంట పట్టించుకునేవాడు. దానికితోడు- అతని వినయ విధేయతలు, నడవడి చూసి మాస్టర్లు ఎంతో అభిమానించేవారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ చేతనైన సహాయం చేసే లక్షణం ఉండడంతో మిగిలిన పిల్లలకుకూడా అతనంటే బాగా ఇష్టం ఉండేది.

సురేష్ ధనికుల బిడ్డయినా- జన్మతః వచ్చిన సంస్కారం అతనిలో ఉండేది. మనిషి గుణానికి విలువ ఇచ్చేవాడు కాని- కులానికి కాని, అంతస్థుకి కాని ప్రాధాన్యం ఇచ్చేవాడు కాదు. అందుకే...అతనికి శేఖర్ అంటే కొద్దిరోజులలోనే మంచి అభిమానం, గౌరవం కలిగాయి. ఆ అభిమానం, గాఢమైన స్నేహం... విడదీయరాని బంధంగా మారాయి.

అలాగని – శేఖర్ ఎప్పుడూ సురేష్ పట్ల అలుసుతీసుకుని దురుసుగా ప్రవర్తించేవాడు కాదు. తమ స్నేహానికి భంగం కల్పించే ఎటువంటి పనికీ అవకాశం ఇచ్చేవాడు కాదు.

సురేష్‌కి ట్యూషన్‌లు ఉన్నా, పాఠాలలో ఎన్నో అనుమానాలు వస్తుండేవి. నిస్సంకోచంగా శేఖర్‌ని అడిగేవాడు. తనకంటే తక్కువ వాడిని అడిగేందుకు అతను బిడియపడేవాడు కాదు.



శేఖర్‌కూడా– తనని సురేష్ వంటి గొప్పవాడు అడిగాడని గర్వంతో విర్రవీగేవాడు కాదు. తన తెలిసిన సమాధానాలను అర్థమయ్యేట్లు చెప్పేవాడు.

ఆ రోజు లెక్కల మాస్టారు హోం వర్క్ క్రింద కొన్ని లెక్కలు ఇచ్చి, మర్నాటికి తప్పకుండ చేసి తీసుకు రమ్మన్నారు.

వాటిలో సురేష్‌కి తెలియని లెక్కలు చాలానే ఉన్నాయి. అందువల్ల శేఖర్ సహాయ తీసుకోవాలనుకున్నాడు.

అతన్ని తన ఇంటికి రమ్మనమని, ఇద్దరం అక్కడే లెక్కలు చేసుకుందామని అడిగాడు.

అందుకు "సరే" అన్నాడు శేఖర్.

వాళ్ళిద్దరూ కాళ్ళూ చేతులు, ముఖం కడుక్కుని వచ్చి ముందుగదిలో కూర్చుని లెక్కలు చేసుకో సాగారు.

సురేష్ తల్లి పార్వతి ఇద్దరికీ రెండు ప్లేట్లలో ఫలహారాలు తెచ్చింది.

ఒక దానిలో ఎక్కువగా పెట్టి, రెండవదానిలో తక్కువ పెట్టింది. ఎక్కువగావున్న ప్లేటుని సురేష్ ముందు, తక్కువగావున్న ప్లేట్‌ను శేఖర్ ముందు ఉంచి, మంచి నీళ్ళు తేవడానికి లోపలికి వెళ్లింది.

ఆమె అటు వెళ్లగానే సురేష్ తన ప్లేట్‌ను శేఖర్ ముందుకు, శేఖర్ ప్లేట్‌ను తన ముందుకు మార్చేశాడు. సీరియస్‌గా లెక్క చదువుతున్న శేఖర్ అది గమనించలేదు.

పార్వతి మంచినీళ్ళ గ్లాసులు తెచ్చి బల్లమీద పెడ్తూ కొడుకు చేసిన మార్పుని గమనించింది.

ఒక రెండుగంటలసేపు ఇద్దరూ కలిసి లెక్కలు చేసుకున్నాక శేఖర్ తన ఇంటికి వెళ్లిపోయాడు.

పార్వతి సురేష్‌ని- "ప్లేట్ ఎందుకు మార్చావు?" అని అడిగింది.

"అమ్మా..! మనింటికి ఎవరైనా వచ్చినప్పుడు ఎక్కువ ఉన్నదీ, మంచిదీ వాళ్ళకియ్యాలి. మనింటికి వచ్చినవారు మన అతిథులు. 'అతిథులు దేవతలతో సమానం' అంటారుకదా! నువ్వు ఇద్దరికీ సమానంగా తెచ్చావనుకో.., ఈ సమస్య లేకపోను. ఎక్కువా తక్కువా ఉన్నప్పుడు అతిథులకు ఎక్కువ ఉన్నది ఇయ్యాలి. మనం చేసే పనులు ఇతరులకి కష్టం కలిగించకూడదు కదమ్మా..?!" అన్నాడు సురేష్.

కొడుకు తన తప్పు ఎత్తి చూపించినందుకు పార్వతికి కోపం రాలేదు సరికదా... ఆనందం వేసింది.

"నీ మీద ప్రేమతో అలా చేశానేకాని, అతన్ని చిన్నచూపు చూడాలని కాదు. అయినా... నేను చేసింది తప్పే. ఇంకెప్పుడూ ఇలా చేయను. 'బాలదపి సుభాషితం' అన్నట్లు- పిల్లవాడివైన నువ్వు మంచిమాట చెప్పావు కనుక, ఇంక ముందు అందర్నీ సమానంగా చూస్తాను. నువ్వు నా కొడుకువైనందుకు గర్విస్తున్నాను" అంది.

★★★